క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న డస్ట్‌బిన్లు

అరకులోయ రూరల్: స్వచ్ఛ సంకల్పంతోనే పరిసరాలు పరిశుభ్రత సాధ్యమని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1.26లక్షల వ్యయంతో 23 వేల డస్ట్ బిన్‌లు మండలానికి అందుబాటులోకి వచ్చిందన్నారు. మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో ఒక్కో ఇంటికి రెండు చొప్పున తడి చెత్త, పొడి చెత్త డస్ట్‌బిన్‌లను పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డస్ట్‌బిన్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలేజీలో సీట్ల భర్తీకి చర్యలు


ప్రిన్సిపాల్ రాంబాబు

కొయ్యూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీపీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీలున్నట్టు ప్రిన్సిపాల్ ఎంఈవో ఎల్.రాంబాబు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా వచ్చిన కళాశాలలో కో–ఎడ్యుకేషన్ ఉందని, బాలురు, బాలికలు కూడా దీనిలో చేరవచ్చన్నారు. అనుభం కలిగిన అధ్యాపకులతో మెరుగైన బోధన ఉంటుందన్నరు. విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం కల్పించాలని డీఈవో ద్వారా కోరుతామన్నారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

60 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న వైద్యులు

చింతపల్లిరూరల్: మండలంలో చైడుపల్లి సచివాలయం వద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు వచ్చారు. శిబిరంలో సుమారు 60 మందికి ఉచితంగా వివిధ రకాల క్యాన్సర్ పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు అన్నసమారాధన


అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆర్డీవో సామ్రాట్ ఆర్.డ్వాడ్జే, సబ్ మేనేజర్ లోవరాజు, సిబ్బంది ఈ కార్యక్రమానికి సహాయ సహకారం అందించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మధ్యాహ్న హారతి, భజనల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచి బాబా దర్శనం కోసం భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు.

నేడు గుండె చికిత్స ఉచిత వైద్య శిబిరం

చోడవరం రూరల్: స్థానిక సంజీవనీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం గుండె చికిత్స ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలను ఉచితంగా అందించడమే గాకుండా కార్డియాలజిస్ట్ పృథ్వీరాజ్ అట్టాడ హృద్రోగులను పరీక్షించి తగు వైద్య చికిత్స అందచేస్తారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ శిబిరానికి హాజరయ్యే రోగులు ముందుగా 9603378145 నంబర్‌కు కాల్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరాయి.

ఖరీఫ్‌కు సమాయత్తం

- వ్యవసాయ పనుల్లో గిరిరైతులు నిమగ్నం
- వరి, చోడి నారుమడులు సిద్ధం
- అంతర పంటలుగా కూరగాయలు, పండ్ల సాగు
- మార్కెట్‌లో గిరాకీ


మాడగడలో వేరుశనగ సాగు చేస్తున్న రైతులు


అమ్మకానికి సిద్ధం చేస్తున్న క్యారెట్

అరకులోయటౌన్: ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు గిరిరైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఏజెన్సీ వ్యాప్తంగా వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఒక పక్క రబీలో వేసిన వరి పంట కోతలు, నూర్పులతో పాటు ఖరీఫ్ సాగుకు అవసరమైన పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఖరీఫ్‌కు అవసరమైన వరి, రాగులు (చోడి) నారు మడులు వేసుకుంటున్నారు. వాణిజ్య పంటలైన వేరుశనగలు, అల్లం, కూరగాయల సాగుకు మెట్ట ప్రాంత భూములు సిద్ధం చేసుకుంటున్నారు. ఏజెన్సీలో పండించే పండ్లు, ఆకుకూరలు, వేరుశనగ, బొబ్బర్లు, రాగులకు మైదాన ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువ. మండలంలోని పలు ప్రాంతాల్లో జరిగే సంతలకు మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను రైతుల నుంచి కొనుగోలు చేసుకొని తీసుకెళ్తున్నారు. ఏజెన్సీలో పనస, పైనాపిల్ ఎక్కువగా విక్రయాలు జరుగుతాయి. వాటికి మైదాన ప్రాంతాల్లో మంచి


ప్రధానిపూట్‌లో పండ్ల మొక్కలు నాటుతున్న రైతులు

గిట్టుబాటు ధరలు ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో పండ్ల సాగు చేపడుతున్నారు. పండ్ల తోటల సాగు చేస్తున్న గిరి రైతులు వేరుశనగ, కూరగాయలు, బొబ్బర్లు (అలసందులు) వంటివి అంతర పంటలుగా వేస్తున్నారు. మండలంలోని చినలబుడు, పద్మాపురం, పెదలబుడు, బస్కీ, మాడగడ, సుంకరమెట్ట పంచాయతీల పరిధిలో వందలాది ఎకరాల్లో కూరకాయల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కూరకాయలతోపాటు వేరుశనగ, పసుపు, అల్లం వంటి లాభదాయకమైన పంటలు వేస్తున్నారు. ఈ ఏడాది కురుస్తున్న వర్షాలకు వాణిజ్య పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉందని గిరిరైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

లాభాలు కురిపిస్తున్న క్యారెట్

చింతపల్లిరూరల్: ఏజెన్సీలో పండించే పంటల్లో క్యారెట్‌కు మంచి ఆదాయం ఉంది. ఇక్కడి వాతావరణం క్యారెట్ పంటకు అనుకూలించడంతో మండలంలో చాలా గ్రామాల్లో రైతుల పండిస్తున్నారు. మన్యంలో పండించే క్యారెట్‌కు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. మార్కెటింగ్‌కు కూడా అనువుగా ఉండడంతో క్యారెట్‌ను గిరిజన రైతులు విస్తారంగా పండిస్తున్నారు. చింతపల్లి మండలంలో చౌడుపల్లి, అన్నవరం, మూలగరువు, గూడెంకొత్తవీధి మండలంలో పెంటపాడు, రింతాడ తదితర గ్రామాల్లో పండిస్తున్నారు. మండలంలో సుమారు గతేడాది ఈ–క్రాప్ బట్టి 232 ఎకరాల్లో కూరగాయలు పండిస్తున్నట్టు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఇందులో క్యారెట్ సుమారు 45 ఎకరాల్లో పండిస్తున్నారు. మన్య ప్రాంత వాతావరణంతో పాటు నేలా మంచిగా అనుకూలించడం వలన పంట దిగబడి బాగుంటుందని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో కుడా మంచి ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం, అనకాపల్లి ప్రాంతాల నుంచి వ్యాపారులు సంతలకు వచ్చి వీటిని కొనుగోలు చేసి విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో 10 కిలోల క్యారెట్ బస్తా రూ.700 నుంచి రూ.900లకు విక్రయిస్తున్నారు. స్థానిక సంతలకు మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి విశాఖపట్నం, నర్సీపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.ప్రస్తుతం పంట దిగుబడులు బాగున్నాయని, రానున్న రోజుల్లో మార్కెట్ ధరలు పెరిగే అవశాలున్నాయని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు అందుబాటులో ఎమ్మెల్యే

అరకులోయ రూరల్: నియోజకవర్గ కేంద్రం అరకులోయలోని శరభగుడ కాలనీ ఆయన నివాసంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం అందుబాటులో ఉంటారని పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం ప్రజలు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి అవసరమైన నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

అరకులోయరూరల్: గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్రలు డిమాండ్ చేశారు. వారు గురువారం మాట్లాడుతు రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలన్నారు. ఎన్నికల సమయంలో అరకులోయలోని బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. జీవో నంబర్–3ని అమలు చేయాలని, గిరిజన ప్రాంతంలో అని శాఖల్లో ఉద్యోగ ఖాళీలను గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 39వేల పోస్టులు ఖాళీ ఉన్నాయని ప్రస్తుతం ప్రకటించిని పోస్టులతో నిరుద్యోగులకు న్యాయం జరగదన్నారు. ఉద్యోగుల ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లు అందజేయాలి

రాజవొమ్మంగి: పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో గురువారం పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎంపీపీ పాఠశాలలకు నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. ఇప్పటికే మండల కేంద్రానికి చేరిన పుస్తకాలను ఆయా పాఠశాల హెచ్‌ఎంలకు అందజేసినట్టు ఎంఈఓ–1 ఎల్.రాంబాబు, ఎంఈఓ –2 టి.సూరయ్యరెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరికి విద్యాకానుక అందేలా బాధ్యతగా వ్యవహరించాలని ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను కోరారు. ఇప్పటికే మండలంలోని 97 పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన యూనిఫాం క్లాత్, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ సరఫరా అయిన సంగతి తెలిసిందే.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక చర్యలు

- హెచ్‌ఎంలకు ఎంఈవో ఆదేశాలు
- మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలి


ఎంఈవో బాబూరావు

జి.మాడుగుల: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి బడుల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామని జి.మాడుగుల మండల విద్యాశాఖాధికారి సీహెచ్.బాబూరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల్లో సదుపాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటితో పాటు, మరుగుదొడ్డలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల ప్రవేశాలకు కల్పించాలని తెలిపామన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూష్, బెల్ట్‌లు, యూనిఫారం తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్లు మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని చేరాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాటిని పాఠశాలలకు అందజేయనున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు తమ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి విద్యార్థుల అభ్యున్నతకి బాటలు వేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు తప్పవన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ ఫెషియల్ అడెండెన్స్ వేయాలన్నారు. పాఠశాలల పరిధిలో అటెండెన్స్ వేయాలని ఆదేశించారు.

వేర్వేరు చోట్ల గతంలో లోకేషన్‌లు పెట్టారని, ఇప్పుడు మండలంలో అన్నిచోట్ల సెల్ టవర్ల ఏర్పాటు చేశారన్నారు. దీంతో పాఠశాల లోకేషన్ మార్పు చేసుకుని అటెండెన్స్ వేయాలన్నారు. వేర్వేరు లోకేషన్‌లలో వేస్తే చర్యలు తప్పవన్నారు. నాడు– నేడు పనులు పూర్తి చేయాలన్నారు. ఎకో క్లబ్ అక్టివిటీస్ పాఠశాలలో అమలు చేయాలన్నారు. పాఠశాల ఆకస్మిక తనిఖీలు ప్రారంభించామన్నారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల పనసపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌ఎం ఎస్.రామరావు కోరారు. ఆయన గురువారం మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం 171 ఖాళీలు ఉన్నాయని, మూడవ తరగతిలో– 40, నాలుగవ తరగతిలో–34, అయిద తరగతిలో–30, ఆరో తరగతిలో–20, ఎనిమిదవ తరగతిలో– 9, 9వ తరగతిలో– 20, పదో తరగతిలో–18 చొప్పున ఖాళీలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఆయా తరగతులలో చేరే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాఠశాలకు వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో 7వ తరగతిలో మాత్రం ఎటువంటి ఖాళీలు లేవని ఆయన తెలిపారు.

ఘనంగా ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే


సీడీపీవో కార్యాలయంలో ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే

గంగవరం : స్థానిక ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో సీహెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యపై పిల్లలకు ఆసక్తి పెంచాలని సూచించారు. చిన్నారుల యొక్క విద్యా సామర్థ్యలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పిల్లలకు ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ పత్రాలను అందించి అభినందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, పిల్లలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఘనంగా సన్మానం


పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును పూలమాలతో సత్కరించిన నాయకులు

జి.మాడుగుల: మండలంలో పలు ప్రాంతాల్లో కొత్త ఎన్నికైన ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తకు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మత్స్య కొండం నాయుడు, నాయకులు చిట్టిబాబు, పండన్న, మన్మథరావు, గబ్బాడి శేఖర్, పూర్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బడిబాట


మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

గంగవరం : వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి పాఠశాలలు పున: ప్రారంభమైయ్యాయి. ఆయా గ్రామాల్లో గిరిజన బాల బాలికలు బడిబాట పట్టారు. మండలంలోని అన్ని పాఠశాలలు పున: ప్రారంభించినట్టు ఎంఈవో మల్లేశ్వరరావు తెలిపారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండి బాలబాలికలను సమీపం పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమం నూరుశాతం మండలంలో విజయవంతం అయిందన్నారు. లోతట్టు గ్రామాల్లో సైతం పాఠశాలలు పున: ప్రారంభానికి బాలబాలికలు హాజరైనట్టు చెప్పారు. మండలంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు విద్యార్థులు చేరుకుంటున్నారన్నారు. వివిధ గ్రామాల్లో విద్యార్థులు బడిబాట పట్టారు.

అవగాహనతోనే ప్లాస్టిక్ నియంత్రణ

కశింకోట: పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు అన్నారు. హైస్కూల్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించి వారిలో అవగాహన పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణ పట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచంట రవి, కాండ్రేగుల అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు


పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

సాక్షి,పాడేరు: పాడేరు ఘాట్‌లో బుధవారం లారీ బోల్తా పడిప ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు కల్పించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వైద్య బృందాలను కోరారు. ఆయన పాడేరు జిల్లా ఆస్పత్రిని గురువారం సందర్శించారు.ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్రతో కలిసి ప్రత్యేక వార్డులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే మత్స్యలింగం పరామర్శించారు.ఇక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆయన ఆరా తీశారు. కేజీహెచ్‌కు తరలించిన బాధితులకు కూడా పూర్తి స్థాయిలో వైద్యసేవలు కల్పించాలని వైద్యులను కోరారు.ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడంపై ఎమ్మెల్యే మత్స్యలింగం విచారం వ్యక్తం చేశారు.

ఆక్రమిత భూములు గిరిజనులకు అప్పగించాలని వినతి


ఆందోళన చేస్తున్న సీపీఐ , గిరిజన సంఘం నేతలు

గంగవరం : మొల్లేరు గ్రామ పంచాయతీ రాముల్దేవపురం గ్రామంలో గిరిజనులకు చెందిన సాగు భూములను వలస గిరిజనేతరుల నుంచి రక్షించాలని, గిరిజన భూములు గిరిజనులకే దక్కేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఏగుపాటి అర్జునరావు, గిరిజన సంఘం నాయకులు మామిడి వీరన్న, కుంజం సత్తయ్యదొర కోరారు. సాగు భూములను గిరిజనులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు, గిరిజన సంఘం నాయకులు ఆధ్వర్యంలో రాముల్దేవపురం (ఆర్.డి.పురం) గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ సత్య సులోచనకు వినతి పత్రాన్ని సమర్పించారు. నాయకులు రాజు, అబ్బాయి, రమణ, రమణయ్యదొర, నూకరత్నం, చెల్లయ్యదొర పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి


ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఐ నేతలు

ఎటపాక: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కుటుంబాలకు 150 రోజుల పనిదినాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ డిమాండ్ చేశారు. గురువారం గన్నవరం గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని ఆమె పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంద రోజుల పనిదినాలు కల్పించటం ద్వారా కుటుంబంలో నలుగురు పనికి వెళితే తక్కువ రోజులకే పనిదినాలు పూర్తవుతున్నాయన్నారు. జాబ్‌కార్డులు ఉన్న వారికి కూడా పనిలేక ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల వల్ల పంటలు నష్టపోవడంతో చాలా మంది రైతులు సాగుకు దూరమవుతున్నారని దీంతో కూలీలకు వ్యవసాయ పనులు కూడా ఉండడం లేదన్నారు. ఉపాధి కూలీ ప్రతీ కుటుంబానికి 150 రోజులు పనిదినాలు కల్పించడంతో పాటు కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కంటె రాజు, సర్పంచ్ భద్రమ్మ, ముత్తయ్య, వెంకటేష్ తదితరులున్నారు.

రేపు కె.జె.పురంలో శ్రీరాధాకృష్ణుల తీర్థం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంట రహదారిలో రాపేట వారి కళ్లాల వద్ద శ్రీరాధాకృష్ణుల తీర్థం ఈ నెల 15న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

వేడుకగా మోదమాంబ సారె ఊరేగింపు


వీరవల్లి అగ్రహారంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారంలో మోదమాంబ సారె ఊరేగింపు గురువారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఇక్కడ మోదమాంబ పీఠం నుంచి మాలధారణ భక్తులు ఈ కార్యక్రమం ప్రారంభించారు. పురవీధుల్లో 101 రకాల పిండి వంటలు, పండ్లు, జీలుగుకల్లు, తాటి, ఈతకాయలు, తదితర నైవేద్య సామగ్రిని ఊరేగించారు. మోదమాంబ ఆలయం వద్ద సారెను భక్తులకు పంపిణీ చేశారు.

వైభవంగా అమ్మవార్ల పండగ

కె.కోటపాడు: చౌడువాడలో గ్రామదేవతలు మరిడిమాంబ, బంగారమ్మ పండగ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. అమ్మవార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో యువకులు ప్రసాద వితరణ చేశారు. పండగ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా మరిడితల్లి పండగ


ఎండ్లు పందాలు నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ: మండలంలో కొంకసింగిలో మరిడితల్లి జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొలువైన అమ్మవారిని గ్రామస్తులతోపాటు ఏఎల్‌పురం, కృష్ణదేవిపేట, నాగాపురం, లింగంపేట, పాడి, రత్నంపేట తదితర గ్రామాల ప్రజలు దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు చేసి కానుకలతో మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన ఎండ్లు పందేలు హోరాహోరీగా సాగాయి. వీటిని తిలకించడానికి సమీప ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచి పది జతల ఎడ్లబళ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల చొప్పున కమిటీ సభ్యులు అందజేశారు.